# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

ధన్యజీవి, ఆదర్శమూర్తి, ప్రభు యేసు క్రీస్తు

సేవాపరాయణుడు, నిర్గర్వి, శాంత చిత్తుడు,

ఆంధ్రలో క్రీస్తు సంఘము నావిష్కరించిన ప్రథముడు,

కొరత ప్రాణమువరకు క్రీస్తును చాటిన నిరాడంబర

సువార్తికుడు

కీ॥ శే॥ అప్పారావు గూటంగారి

చిర స్మరణీయ స్మృతికి ఈ సత్యవాక్య-

సంచిక ప్రేమతో అంకితం ! !

(వివరములు 10వ పేజీలో)

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్టు బాక్స్ - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ : జె. పి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక **8** మార్చి **1986** సంపుటి **6**


## సంపాదకీయము

### తండ్రి తన బిడ్డలు

***(A Father and His Children)***

తండ్రి తన బిడ్డల మధ్యనున్న సంబంధము చాల అందమైనది. తండ్రి తన బిడ్డల యెడల బాధ్యత కలిగియున్నాడు. అతడు వారిని ప్రేమిస్తాడు, అందువలన ఒక్కోసారి వారిని శిక్షిస్తాడు. శ్రేష్టమైన వాటినే తన బిడ్డల కీయనెంచుతాడు. గాని ఒక్కోసారి వాటిని వారి నుండి దూరం చేస్తాడు. బిడ్డలు తమ తండ్రిని ప్రేమించి అతడు వారిని జాగ్రత్తగా చూస్తాడని, సంరక్షిస్తాడని అతనియందు పూర్తి నమ్మిక కలిగియుంటారు. శిక్షింపబడడం వారికి ఇష్టముండదు; అయినను శిక్షింపబడిన తరువాత ఇంతకు ముందుకంటే వారతని ఎక్కువ ప్రేమిస్తారు. వారు తమ భోజనం, బట్టలు ఎక్కడనుండి వచ్చుచున్నవో, వారి యింటి అద్దె ఇచ్చేసారో లేదో యనువాటిని గూర్చి చింతించరు. శత్రువులను గూర్చిన భయం వారికుండదు. తండ్రి తమ చెయ్యి పట్టుకొని నడిపిస్తు, సంరక్షిస్తు, వారి యవసరాలను తీర్చేకొలది, అతడు వారిని ప్రేమించుచున్నాడని, అంతా క్షేమమేయని వారెరుగుదురు.

పరలోక తండ్రి మరియు తన బిడ్డలైన క్రైస్తవులను గూర్చి కూడ ఇది సత్యము. దేవుడు తన బిడ్డల యెడల కలిగియున్న ప్రేమను గూర్చి, వారాయన యెడల ఒండొరుల యెడల కలిగియుండవలసిన ప్రేమనుగూర్చి మన మాలోచింతము :

1. దేవుడు లోకములో యున్న వారందరినీ ప్రేమించుచున్నాడని మనం జ్ఞాపకముంచుకోవాలి, ఏలయనగా మానవుని సృజించి వానికి జీవము పోసినవాడు ఆయనే. మానవుడు పాపముచేసి సృష్టికర్తకు శత్రువయ్యాడు. అయినను మానవుడు రక్షింపబడునట్లు దేవుడు తనకుమారుని పంపి ప్రేమజూపాడు: "దేవుడు లోకము నెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని లోకమునకు తీర్పు తీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు" (యోహాను 3:16, 17). "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు; ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెనని" పౌలు చెప్పుచున్నాడు (రోమా 5:8). ఆయన మనలను ప్రేమించాడు గనుక మన నిమిత్తము తన ప్రాణము పెట్టెనని యోహాను చెప్పాడు (1 యోహా 3:16). క్రీస్తు మన నిమిత్తము తన ప్రాణము పెట్టెనని పౌలు మరల చెప్పాడు (గలతీ 2 : 20).

2. దేవుడు మనలను ప్రేమించినందునను, క్రీస్తు ద్వారా మనము రక్షింపబడ గలిగే అవకాశము కల్పించినందునను మనము దేవునికి కుమారులము, కుమార్తెలము అయ్యాము. అపొ. యోహాను ఇట్లు చెప్పాడు : "మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమ ననుగ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే.

ఈ హేతువుచేత లోకము మనలనెరుగదు, ఏలయనగా అది ఆయనను ఎరుగలేదు" (1 యోహాను 3:1).

3. దేవుడు మన తండ్రి, మనమాయన బిడ్డలము గనుక మన మాయనను ప్రేమించాలని ఆయన కోరుచున్నాడు. "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని క్రీస్తు చెప్పాడు (యోహాను 14:15). నీపూర్ణ హృదయముతోను, నీపూర్ణ మనస్సుతోను, పూర్ణాత్మతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెననికూడ ఆయన చెప్పాడు (మత్త 22:37). "ఒకడు నన్ను ప్రేమించిన యెడల వాడు నామాట గైకొనును, అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించును. మేము వానియొద్దకు వచ్చి వానియొద్ద నివాసము చేతుము. నన్ను ప్రేమింపనివాడు నామాటలు గైకొనడు; మీరు వినుచున్న మాట నా మాట కాదు, నన్ను పంపిన తండ్రిదే" యని ఆయన చెప్పాడు (యోహాను 14:23, 24).

4. తండ్రి మనలను సంరక్షిస్తాడు, దీవిస్తాడు, ఏలయనగా మనమాయన బిడ్డలము. పౌలు ఇట్లు వ్రాసాడు: "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడునుగాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మసంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మన కనుగ్రహించెను" (ఎఫెసీ 1:3). యోహాను ఇట్లు ప్రకటించాడు: "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనము వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతిపాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7). "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్య మేదనగా, ఆయన చిత్తానుసారముగా మన మేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే. మన మేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మన మెరిగిన యెడల మన మాయనను వేడుకొనినవి మనకు కలిగిన

వని యెరుగుదుము" అని అతడు మరల చెప్పాడు (1 యోహాను 5:14, 15). "దేవుడు తన్ను ప్రేమించు వారికొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయము నకు గోచరము కాలేదు" అని పౌలు చెప్పుచున్నాడు (1 కొరింథీ 2:9).

5. ప్రభువు మనలను ప్రేమించుచున్నాడు గనుక మనమాయనకు అవిధేయులైనప్పుడు ఆయన మనలను శిక్షిస్తాడు. హెబ్రీ పత్రిక లేఖకుడిట్లన్నాడు: "మీరు పాపముతో పోరాడుటలో రక్తము కారునంతగా ఇంకదానిని ఎదిరింపలేదు. మరియు, నా కుమారుడా ప్రభువు చేయు శిక్షను తృణీకరించకుము - ఆయన నిన్ను గద్దించి నప్పుడు విసుకకుము-ప్రభువు తాను ప్రేమించు వానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును అని కుమారులతో సంభాషించినట్లు మీతో సంభాషించు ఆయన హెచ్చరికను మరచితిరి. శిక్షా ఫలము పొందుటకై మీరు సహించుచున్నారు; దేవుడు కుమారులమగా మిమ్మును చూచు చున్నాడు. తండ్రి శిక్షింపని కుమారుడెవడు? కుమాళ్లయిన వారందరు శిక్షలో పాలుపొందుచున్నారు, మీరు పొందని యెడల దుర్బీజులేగాని కుమారులు కారు. మరియు శరీర సంబంధులైన తండ్రులు మనకు శిక్షకులై యుండిరి. వారి యందు భయభక్తులు కలిగియుంటిమి. అట్లయితే ఆత్మలకు తండ్రియైన వానికి మరి యెక్కువగాలోబడి బ్రతుకవలెనుగదా? వారు కొన్ని దినములమట్టుకు తమ కిష్టము వచ్చినట్లు మనలను శిక్షించిరిగాని మనము తన పరిశుద్ధతలో పాలుపొందవలెనని మన మేలుకొరకే ఆయన శిక్షించుచున్నాడు. మరియు ప్రస్తుతమందు సమస్త శిక్షయు దుఃఖకరముగా కనబడునేగాని సంతోషకరముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము కలిగిన వారికి అది నీతియను సమాధాన కరమైన ఫలమిచ్చును" (హెబ్రీ 12:4-11).

6. దేవుని బిడ్డలవలె మనము ఒండొరులను ప్రేమించాలని

దేవుడు కోరుచున్నాడు. యోహాను ఇట్లు చెప్పాడు: "మనయెడల దేవునికి ఉన్న ప్రేమను మనమెరిగినవారమై దానినమ్ముకొనియున్నాము; దేవుడు ప్రేమా స్వరూపియై యున్నాడు; ప్రేమయందు నిలిచియుండు వాడు దేవునియందు నిలిచి యున్నాడు; దేవుడు వానియందు నిలిచి యున్నాడు. తీర్పు దినమందు మనకు ధైర్యము కలుగునట్లు దీనివలన ప్రేమ మనలో పరిపూర్ణము చేయబడియున్నది; ఏలయనగా ఆయన ఎట్టివాడై యున్నాడో మనముకూడ ఈ లోకములో అట్టివారమై యున్నాము. ప్రేమలో భయముండదు; అంతేకాదు పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్ళగొట్టును; భయము దండనతో కూడినది; భయపడు వాడు ప్రేమయందు పరిపూర్ణము చేయబడినవాడు కాడు. ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము. ఎవడైనను నేను దేవుని ప్రేమించుచున్నానని చెప్పి తన సహోదరుని ద్వేషించినయెడల అతడు అబద్ధికుడగును; తాను చూచిన తన సహో దరుని ప్రేమింపనివాడు తాను చూడని దేవుని ప్రేమింపలేడు. దేవుని ప్రేమించువాడు తన సహోదరుని కూడ ప్రేమింపవలెనను ఆజ్ఞను మనమాయన వలన పొందియున్నాము" (1 యోహాను 4:16-21). "మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురు" అని క్రీస్తు చెప్పాడు (యోహాను 13:35).

7. ప్రభువు కుటుంబమయిన సంఘాన్ని మనము ప్రేమించాలి. క్రీస్తు సంఘమును ప్రేమించి దానికొరకు తన్ను తాను అప్పగించు కొన్నాడు (ఎఫె 5:25). క్రీస్తు మనకొరకు తన ప్రాణ మర్పించాడు గనుక సహోదరుల కొరకు మన ప్రాణ మర్పించుటకు మనం సిద్ధపడా లని యోహాను చెప్పాడు (1 యోహా 3:16). "అందరిని సన్మానించుడి, సహోదరులను ప్రేమించుడి, దేవునికి భయపడుడి, రాజును సన్మా నించుడి" యని పేతురు చెప్పాడు (1 పేతురు 2:17).

ప్రభువు మనలను ప్రేమించుచు, మనమూయనను ప్రేమించుచు ఉన్న యెడల ఇరువైపుల ఆ ప్రేమ కనబడతాది. అది మనలను రక్షించునట్టి ప్రేమ యోగాకుండ ఇతరులను ప్రభువునొద్దకు ఆకర్షిస్తాది.

నీవట్టి ప్రేమ కలిగియున్నావు? నీవు దేవుని బిడ్డవా? ప్రభువు నిన్ను తండ్రివలె సంరక్షించి, నీ అవసరాలన్నీ తీర్చి నిన్ను పరలోకానికి తీసికొని వెళ్తాడనే నిర్ధారణ నీకున్నదా? నీలోనుండి భయమును పారద్రోలే ప్రేమ నీకున్నదా? పరలోకమందున్న మన తండ్రి, మన ప్రభువైన యేసుక్రీస్తు మాత్రమే దీనినంతటినీ, ఇంకా ఎంతో ఎక్కువను నీకు చేయగలరు.

---

## మనము బైబిలు నెందుకు నమ్ముచున్నాము
### *(Why We Believe the Bible)*

నీవు బైబిలును నమ్ముచున్నావా? క్రైస్తవులు బైబిలు నెందుకు నమ్ముదురు? ప్రపంచములో యున్న గ్రంథము లన్నిటికంటె బైబిలును వేరుగా వారెందుకు పరిగణిస్తారు? భక్తి విషయాల్లో బైబిలు ఒక్కటి మాత్రమే అధికార పూరితమైనదని క్రైస్తవులు ఎందుకు అంగీకరిస్తారు ?

భక్తి విషయాల్లో మానవుని వివేకమే అధికారపూరితమని కొందరు నమ్ముతారు. ఇదే మోడర్నిజమ్ అంటేను. కొందరు అనుభవాలను, భావాలను వల్లిస్తారు. ఇది పెంతెకొస్తులవారి పద్ధతి. మరి కొందరు పారంపర్యాచారములు బైబిలుతో సమానములని, లేక బైబిలుకంటె అధికారయుక్తములని అంటారు. యిది కేథలిక్కుల పద్ధతి. ఆత్మీయ విషయాల్లో బైబిలు ఒక్కటి మాత్రమే అధికారయుక్తమైనదని క్రీస్తుసంఘము మనవిచేయుచున్నది. మనము అట్లెందుకు చేయుచున్నాము? మనము బైబిలు నెందుకు నమ్ముచున్నాము?

"దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదే

శించుటకును ఖండించుటకును తప్పు దిద్దుటకును నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" యని పౌలు చెప్పాడు (2 తిమో 3:16, 17). లేఖనము అనగా లిఖించబడిన వాక్యము. దానినే మనం బైబిలు అంటున్నాము. దైవావేశము అంటే దేవుడు ఊదిన మాటలు, అంటే బైబిలులోని మాటలు. అవి మానవుల చేతితో వ్రాయబడినను అవి దేవుడు ఊదగా లేక పలుకగా వ్రాయబడిన మాటలు. అందువలననే బైబిలును మనము దేవుని వాక్యమని చెబుతాము. బైబిలు దేవుని వాక్యమని మనమెట్లు తెలిసికోగలము? కొన్ని కారణాలను చూద్దాం.

## బైబిలు మానవుని అవసరాలను తీర్చుచున్నది

నేననేక గ్రంథాలను, వ్యాసాలను చదివాను. మీరు కూడ చదివేయుంటారు. కొన్ని గ్రంథాలు నా కిష్టములు. రకరకాల పుస్తకాలు రకరకాల అవసరాలను తీరుస్తాయి. ఉదాహరణకు కారునుగాని సైకిలునుగాని నడిపే విధానాన్ని బైబిలు నీకు తెలియజేయదు. అది మన అతి ప్రాముఖ్యమైన అవసరాలను తెలియజేయుచున్నది. నీనెక్కడి నుండి వచ్చావో బైబిలు తెలియజేస్తుంది. నీవు దేవునిచే సృష్టింపబడ్డావు. "దేవుడు మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము" అని చెప్పాడు (ఆది 1:26). మన జీవిత ప్రయోజనాన్ని బైబిలు మనకు చెప్పుచున్నది. మనము "దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండవలెను. మానవకోటికి ఇదియే విధి" (ప్రసంగి 12:13). మానవు డెక్కడికి వెళ్లుచున్నాడో బైబిలు తెలియజేస్తుంది. "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9 : 27). మనము దేవునికి నమ్మకముగా యున్నయెడల మనకు పరలోకములో ఒక స్థానము సిద్ధపరచబడి యున్నదని మన మెరుగుదుము (యోహాను 14:1-3). మానవుని నిగూఢమైన అవసరాలను తీర్చే గ్రంథము,

బైబిలు, నిజంగా అత్యవసరమైన ప్రశ్నలకు అనగా, నే నెక్కడి నుండి వచ్చాను. నే నెందుకు ఇక్కడ ఉన్నాను ? నే నెక్కడికి వెళ్లుచున్నాను ? అనే ప్రశ్నల కది జవాబిచ్చుచున్నది. మానవుని యొక్క లోతైన ఈ అవుసరాలను బైబిలు తీర్చుచున్నది గనుక బైబిలు దేవునినుండి కలిగినదని మన మెరుగుదుము.

## బైబిలు యొక్క శక్తి ప్రభావములు

బైబిలు యొక్క శక్తి ప్రభావములు నిలిచియున్నవి గనుక అది దేవుని వాక్యమని మన మెరుగగలము. బైబిలు దేవుని వాక్యము గనుక అది మీ ఆత్మలను రక్షించు శక్తిగలది (యాకోబు 1 : 21). బైబిలు శక్తిగలది యని పౌలు చెప్పాడు: "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి ... రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1 : 16). "దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" యని హెబ్రీ పత్రిక లేఖకుడు వ్రాసాడు (హెబ్రీ 4:12).

బైబిలు యొక్క ఈ ఆశ్చర్యకరమైన శక్తిని చూడాలంటే మన చుట్టూ ఒక్కమారు చూస్తే చాలు. బైబిలు వలన అనేక జీవితాలు మార్చబడ్డాయి. దేవుని వాక్యము వలన వందలాది త్రాగుబోతులు త్రాగడం మానేసారు. బైబిలు యొక్క శక్తివలన మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారు తమ జీవితాలను పాడుచేసుకోవడం మానేసారు. అసూయ ద్వేషము గల ప్రజలు బైబిలు వలన ప్రేమ దయగల ప్రజలుగా మార్చబడ్డారు. స్వార్థపరులు, నిర్లక్ష్యపరులు నిస్వార్థపరులుగా మార్చబడ్డారు. ప్రతి జనాంగములోని ప్రజలు, ప్రతి

తరమువారు, ప్రతివృత్తిలో నున్నవారు బైబిలునందున్న దేవుని ఉప దేశ వక్తివలన తమ జీవితములను మార్చుకొన్నారు. అది పనిచేయు చున్నందున బైబిలు దేవుని వాక్యమని మన మెరుగగలము.

బైబిలును మనము నమ్ముటకు గల కారణము లనేకము లున్నవి. పైన చెప్పుకొన్న రెండు కారణాలనుబట్టి నీవు నీ బైబిలును చదువుట ఎంత ప్రాముఖ్యమో తెలిసికోగలవు. ఈ లోకంలో అది అతిప్రాముఖ్యమైన గ్రంథము. నీవు దానిని చదివి దాని ఉపదేశ ములను అనుసరించిన యెడల నీ ఆత్మను రక్షించే శక్తి అది. నిత్యత్వ మంతా నీవు దేవునితో పరలోకంలో గడపాలని మేము కోరు చున్నాము. పరలోకంలో నీ కొక గృహముండునట్లు దయచేసి నీ బైబిలును చదువుము.

— స్టీవ్ విలియమ్స్


---

## ప్రకటన

ప్రతి క్రీస్తు సంఘ బోధకుడు, సభ్యుడు చదువవలసిన పుస్తకము : "నే నేల క్రీస్తు సంఘ సభ్యుడనైతిని". 278 పేజీలు గల ఫుల్‌క్లాత్ బైండింగ్ పుస్తకము పోస్టేజీతో సహా రూ. 2–50 మాత్రమే. ఈ దిగువ చిరునామాకు Rs. 2–50 M. O. ద్వారా గాని, లేదా పోస్టల్ స్టాంపులు పంపిగాని మీ కాపీని వెంటనే పొందండి :

SATYA VANI
P.O. Box 80, Kakinada-533 001

# ఆదర్శజీవి అప్పారావు గూటం



''ఇప్పటినుండి ప్రభువు నందు మృతి నొందు మృతులు ధన్యులు ... నిజమే వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు; వారి క్రియలు వారి వెంట పోవును''

ప్రక.14:13

తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట తాలుకా గంటి గ్రామము నందలి క్రీస్తు సంఘ సేవకులైన సహోదరుడు గూటం అప్పారావు గారు 82వ ఏట తమ భౌతిక యాత్రను ముగించుకొని తాను నమ్మిన ప్రభువుదగ్గరకు తాను నిరీక్షించిన మహిమలోనికి గొప్ప ఆశీర్వాదముతో ప్రవేశించియున్నారు.

వారు కొద్దిపాటి అస్వస్థతతో ఆసుపత్రిలో చేర్చబడి 11-2-86 ఉదయం 10–15 ని॥లకు తాను నమ్మిన ప్రభువుకు తన ఆత్మను అప్పగించారు. విచార కరమగు ఈవార్త వినిన వందలాది బంధుమిత్రులు, సంఘ సభ్యులు వచ్చి సహో. అప్పారావుగారి భౌతిక కాయాన్ని దర్శించిరి.

12-2-86 ఉదయం 10 గంటలకు జరిగిన భూస్థాపన కార్య క్రమములో అసంఖ్యాకులైన జనులు పాల్గొని తమ తమ ఆత్మాభి మానాన్ని ప్రదర్శించిరి.

బ్రదరు T. జ్ఞానానందంగారి నిర్వహణలో భూస్థాపన కార్య క్రమము సకల గౌరవ మర్యాదలతో కాకినాడ క్రైస్తవ సమాధుల దొడ్డి యందు జరుపబడెను.

సహో॥ గూటం అప్పారావుగార్కి ఆరుగురు కుమారులు అయిదుగురు కుమార్తెలు, 18 మనుమలు ముగ్గురు మునిమనుమలు ఉన్నారు. ఇంకను ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులకు వివాహము జరుగవలసియున్నది. సహో॥ అప్పారావుగారు ఆరుగురు బిడ్డల తరు వాత సతీ వియోగం కలిగినందున ద్వితీయ పరిణయం జరుపుకొని దీవెన కరమగు మరి అయిదుగురు బిడ్డలను పొందిరి.

సహో॥ అప్పారావుగారు తమ బిడ్డలందరిని దేవుని భక్తిలోను భయములోను పెంచి ఉన్నత విద్యావంతులనుగా జేసెను. ప్రస్తుతము మన అందరి వినికిడిలో అతి పరిచయులుగా ఉన్న సత్యవాణి రేడియో ప్రసంగికులు బ్రదర్ జాషువా గూటంగారు, స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరెక్టర్ బ్రదర్ నెహెమ్యా గూటంగారు కీ॥ శే॥ లైన గూటం అప్పారావుగారి కుమారులే. వీరు బాల్యమునుండి క్రీస్తు సంఘముల అభివృద్ధికొరకు ఆంధ్రా అంతటిలోను ఇండియాలో పలుచోట్లను మిక్కిలి ఆసక్తితో చేయుచున్న సువార్తసేవ మనకు మరుగైనది కాదు.

సహో॥ అప్పారావుగారు సెంట్రల్ డెల్టాలో గల గంటి గ్రామ ములో 82 సంవత్సరముల క్రితం జన్మించారు. వీరు ఆదినాలలో ఉపా ధ్యాయ ఉద్యోగానికి సరిపడిన చదువు చదువుకొన్నారు. ఆ చదువుట యందు వారి సోదరుడు గూటం సామ్యూయేలుగారి ప్రోత్సాహం

సమృద్ధిగా లభించింది. గంటిలో వీరి వర్గీయుల మధ్య ప్రాథమిక పాఠశాల లేనందున ఆ గ్రామానికి విద్యావికాసము కలుగుట లేదనే చింతతో వారి పెద్ద తండ్రి కుమారుడగు గూటం జాన్ తాతయ్య గారితో ఆలోచించగా తమ్మునికి కలిగిన గొప్ప ఆసక్తికి త్యాగబుద్ధికి మిక్కిలి సంతోషించిన గూటం జాన్ తాతయ్యగారు అప్పటికే వారు ఉపాధ్యాయులుగా ఉంటు కొన్నిచోట్ల మేనేజ్‌మెంటు పాఠశాలలు స్థాపించి నడిపించుచున్నందున గంటి గ్రామములో అప్పారావుగారి కోరిక మేరకు ఒక ఎలిమెంటరీ స్కూలు స్థాపించి అందు ఉపాధ్యాయునిగా అప్పారావుగారికి బాధ్యతలు అప్పగించిరి. ఇక అప్పారావుగారి ఆనందమునకు అంతులేదు. ఒకప్రక్క పిల్లలను తన స్కూల్‌లో చేర్పించి విద్యాజ్ఞానములు నేర్పుచు అప్పటికే తాను నమ్మిన క్రీస్తు రక్షణ మార్గాన్ని తన ప్రజలకు ప్రకటించుచు గొప్ప ప్రోత్సాహముతో, త్యాగముతో, స్వల్పకాలములోనే గొప్ప అభివృద్ధిని సాధించారు. ఇంత గొప్ప అభివృద్ధిని చూస్తు గూటం జాన్ తాతయ్యగారు అప్పటికి ట్రైనింగైయున్న తన తమ్ముడైన గూటం జాన్‌గర్షి అప్పారావుగార్కి సహాయోపాధ్యాయునిగా గంటి ఎలిమెంటరీ పాఠశాలలో నియమించిరి. వీరిరువురు సదరు స్కూలును అభివృద్ధి చేయుచున్న విధానమును చూచి వీరి కష్టమునకు తగిన జీతము ఇవ్వలేకపోవుచున్నానని తలంచిన జాన్ తాతయ్యగారు సదరు స్కూలును గవర్నమెంటు వారికి అప్పగించిరి. అప్పుడది గవర్నమెంటు లేబరు స్కూలుగా ప్రభుత్వపువారిచే అంగీకరించబడి వీరు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపబడిరి.

కొంతకాలము తరువాత గూటం జాన్‌గారు వేరేస్కూలుకు ట్రాన్స్‌ఫర్ చేయబడిరి. అటు తరువాత ఎందరో ఉపాధ్యాయులు అప్పారావుగార్కి సహోపాధ్యాయులుగా వస్తూ వెళ్లుచూ ఇద్దరు కాక ముగ్గురు ఉపాధ్యాయులు కూడ అవసరమైనంతగా అప్పారావుగారి ఆధ్వర్యములోనే స్కూలు వృద్ధిచెందెను.

అప్పారావుగారు పిల్లల పురోభివృద్ధికి చేయుచున్న కృషి వారి అభివృద్ధికొరకు తీసుకున్న జాగ్రత్తలు చూస్తున్న గ్రామ వాసులు ఆయన యెడల మిక్కిలి అభిమానము చూపుటయేగాక ప్రభుత్వము వారు కూడ అప్పారావుగారి విధినిర్వాహకత్వమును ప్రసంశనీయంగా గుర్తించి వారి ఉపాధ్యాయ వృత్తిమీద చిన్న రిమార్కు కూడ చేయలేక పోయిరి. అంతేకాదు విచిత్ర మేమంటే అప్పారావుగారు ఏ స్కూల్‌లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టారో అదే స్కూలులో, అదే గ్రామములో తమ సర్వీసు అంతయు గొప్ప ఆదర్శ ఉపాధ్యాయునిగా చేసి ఎక్కడికీ ట్రాన్స్‌ఫర్ కాకుండా రిటైర్ అయినారు.

అప్పారావుగారి వలన అక్షర అభ్యాసం పొందిన అనేకులు ఉన్నత విద్యావంతులై ఉపాధ్యాయులుగాను, గజెటెడ్ ఆఫీసర్లుగాను, సంఘసేవకులుగాను వృద్ధి చెందుచు ఉన్నారు. వారిలో కొందరు రిటైర్ అయిపోయారు కూడా !

అప్పారావుగారు ఇతరుల అభివృద్ధి కోరుచు హృదయ పూర్వకమైన ప్రేమతో బోధించేవారు, మాట్లాడేవారు. అందుచే అనేక బాల్య హృదయాల్లో అప్పారావుగారి పాఠములు అంటుకుపోయేవి. చిన్నల, పెద్దల హృదయాలకు సముచిత ఆదరణ వారి యొద్ద సమృద్ధిగా దొరికేది.

అప్పారావుగారు వస్త్రధారణలోను, మాటలలోను, స్నేహము లోను గొప్ప ఆదర్శ జీవితాన్ని సత్ సాంగత్య నడవడిని కనబర చేవారు. వారు మాట్లాడేటప్పుడు చక్కని తెలుగు భాషా శైలిని అనుసరించి వాత్సల్య భావ పూరితంగా మాట్లాడేవారు. అందుకే పిల్లలు, పెద్దలు క్రైస్తవులు, క్రైస్తవేతరులు కూడ వారితో సంభాషించుట యందు అభిలాషను కనుపర చేవారు. అప్పారావుగారి జీవితం మిగిలిన వారికి ఎంతగానో ఆదర్శంగా ఉన్నది. వారు శారీరకంగా మన మధ్య లేకపోయినాగాని వారి కీర్తి చిరస్మరణీయంగా సజీవంగా మనమధ్య మిగిలిపోయింది.

అప్పారావుగారు చిన్న నాటినుండి దేవుని భయము, భక్తిగల వారు. అందుచేతనే వారికి అప్పగింపబడిన ఉపాధ్యాయ వృత్తిలోను, ప్రభుత్వపు విధినిర్వాహణలోను, గ్రామ ప్రజల సమక్షములోను నిజాయితీ జీవితాన్ని కలిగియుండుట మాత్రమే కాక తమ కుటుంబ సభ్యులను జ్ఞానవివేకములతో కూడిన దైవ భక్తిగల మంచి కుటుంబముగా తీర్చి దిద్ద గలిగారు.

మరియు అప్పారావుగారు ఆదర్శ ఉపాధ్యాయునిగా మాత్రమే కాక ఆదర్శ క్రైస్తవునిగాను క్రీస్తుసేవలో నమ్మకమైన సువార్తకుని గాను జీవించిరి. అప్పారావుగారు క్రైస్తవ సంఘ విస్తరణకు శక్తికి మించి శ్రమించిరి అనునది ఆయన పరిచర్యను చూచిన వారు ఎవరును కాదనలేరు.

వారు స్కూలుకు వెళ్లేటపుడు చేతిలో బెత్తముతోపాటు బైబిలు గ్రంథము కూడ ఉండేది. స్కూలు విరామ సమయములో తప్పక బైబిలు చదివేవారు. అనేక జీవితములను అదుపులోపెట్టి అభివృద్ధి చేయుటకు బెత్తమును, వారి జీవితాన్ని ఆదర్శంగాను ఆత్మీయంగాను అనుక్షణము తీర్చి దిద్దుటకు బైబిలును వారు తమ దినచర్యలో ఉపయోగించేవారు. అప్పారావుగారు దినమంతా స్కూలులో నమ్మకంగా పనిచేసి సాయంకాలమున పరిసరగ్రామాల్లో సువార్త ప్రకటించు నిమిత్తము పది, పదిహేను మైళ్లు సైకిలుపై వెళ్లేవారు. వారి కూడా రాత్రిభోజనం పట్టుకు వెళ్లేవారు, మరల తెల్లవారి సకాలంలో తమ స్కూలుకు వెళ్ళి పనిచేపట్టేవారు. ఈ రీతిగా జిల్లాలోగల అనేక ప్రాంతాల్లో సంఘాలను సమకూర్చి వాటి అభివృద్ధికి మిక్కిలి శ్రమపడ్డారు.

అప్పారావుగారు క్రైస్తవ బోధకుల యెడల మిక్కిలి గౌరవము కనుబరచిరి. ఆదినాలలో క్రైస్తవ సాధువులుగాను, బోధకులు

గాను వచ్చే సువార్త పరిచారకులకు చక్కటి ఆతిథ్యమిచ్చేవారు. నెలల తరబడి వారిని ఆదరిస్తూ పరిసర ప్రాంతాల్లో సేవకై వారిని నడిపిస్తూ సంఘ అభివృద్ధికి మిక్కిలి శ్రమలు పడేవారు. ఆదినాలలో అనేకులైన సంచార బోధకులకు, ఆశ్రయస్థానంగా అప్పారావుగారి గృహము ఎప్పుడు స్వాగతం పలికేది.

అప్పారావుగారి బిడ్డలు గంటి గ్రామమందలి తమతోటి విద్యార్థుల మధ్య సండే స్కూలు జరుపుచు, అందుకు అనుబంధమైన అనేక ప్రోత్సాహకరమైన ఆత్మీయ కార్యక్రమములు చేపట్టుచు చిన్న పెద్ద హృదయములను క్రీస్తు ప్రేమతో ఉత్తేజపరుస్తూ ఉండేవారు.

అప్పారావుగారి కుమారులైన నెహెమ్యా, జాషువాగార్లు కాలేజీ విద్యార్థులుగా ఉంటూ పరిచయ పరుచుకొన్న Bro జె.సి. బెయిలీగారికి అతిథి ప్రియులైన అప్పారావుగారు ఆశ్రయమిచ్చుటకు వెనుకాడక వారిని తమ ఇంట చేర్చుకొని 1964 సం॥లో వారి సువార్త పరిచర్యను సంతోషముగా అంగీకరించిరి.

ఆరంభ సమయంలో బెయిలీగారు రోగియై అప్పారావుగారి ఇంటి దగ్గర బాధపడుచుండగా అప్పారావుగారు ఎనలేని పరిచర్య చేసి వారి పునర్ ఆరోగ్యానికి ఎంతగానో తోడ్పడి వైద్యము చేయించిరి. బెయిలీగారికి వైద్యముచేసిన డాక్టరుగారికి అయిన ఖర్చులు కూడ అప్పారావుగారు అతిథి సత్కార్యముగా భావించిరే తప్ప వేరే విధ మను గైకొనలేదు. తరువాత బ్రదరు జె. సి. బెయిలీగారు బోధించు ధము కేవలము బైబిలు అనుసారంగా ఉన్నందునను, అంతవరకు తాము ఎరిగియున్న సంఘ విధము మానవ కల్పిత సిద్ధాంతాలుగలది యని కనుగొనుటచేతను అప్పారావుగారు సంపూర్ణమైయున్న దేవుని త్రముగల క్రొత్తనిబంధన వాక్యము నంగీకరించుటకు ధైర్యము చ్చుకొని క్రీస్తు సంఘము అను లేఖన ప్రకారమైన పేరుతో క్రీస్తు

సువార్త ప్రకటింప మొదలు పెట్టెను. ఈగొప్ప మర్మమును కను గొన్న అప్పారావుగారి కుటుంబము కూడ క్రీస్తు మార్గమందు క్రొత్త నిబంధన క్రైస్తవ్యములో నడచుటకు త్యాగముతో ముందుకు వచ్చి మిక్కిలి ప్రయాసముతో క్రీస్తుకు నమ్మకమైన పరిచారకులుగా క్రీస్తు సంఘము యొక్క విస్తరణకు పాటుపడుచున్నారు.

అప్పారావుగారు మానవ కల్పిత సిద్ధాంతములను అనుసరిస్తున్న తమ పొరుగు వారివలన కలిగే నిందలను గొప్ప ఓర్పుతోను క్రీస్తు వాక్యమునందు తమకు గల ప్రగాఢ విశ్వాసముతోను సహించుచు సువార్త పనియందు ఏ కొంచెము నిరాశ చెందక ఆత్మీయ తీవ్రతతో క్రొత్త నిబంధన క్రైస్తవ్యమును గూర్చి పోరాడిరి.

ఇక కొంతకాలానికి వారి సర్వీసు పూర్తికావడంతో ఉద్యోగ విరమణ (Retirement) కావలసి వచ్చెను. అటు తరువాత ఆయన విస్తరించి డెల్టా అన్ని ప్రాంతాలు తిరిగి సేవ చేసారు. ప్రస్తుతం డెల్టా ప్రాంతమందుగల క్రీస్తు సంఘాలన్నీ అప్పారావుగారి పరిచర్యవల్ల సమకూర్చబడినవే. మరియు డెల్టాలోనే కాదు ఆంధ్ర యందంతటగల క్రీస్తు సంఘంయొక్క ఆరంభానికి పునాదిగా, మూలముగా నిలిచిన వారు అప్పారావుగారే అని చెప్పక తప్పదు. క్రీస్తు సంఘజ్యోల అప్పారావుగారి ఇంటిలో మొదటగా వెలిగింపబడి, డెల్టాలోను ఆంధ్ర అంతట మాత్రమేకాక అప్పారావుగారి కుమారుల ద్వారా బొంబాయి, అస్సాం, గుజరాత్ రాష్ట్రాలలో కూడ ప్రకాశించుచున్నది.

సహో॥ అప్పారావుగారి కుమారుడు తెలుగులోనే కాక ఇంగ్లీషులో, మనీలా, మాల్దీవులలో కూడ రేడియో కేంద్రం ద్వారా క్రీస్తు సంఘజ్యోలను ప్రకాశింపజేయుట గొప్ప విశేషము. మరియు అప్పారావుగారి కుమారులలో మరియొకరు కాకినాడలో స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ అను పేరుతో నడుపుచున్న స్కూలులో ఏటా అనేక

మంది యువకులను క్రీస్తు సువార్త సత్యమందు గొప్ప వాక్య తర్ఫీదు నిచ్చి ఆంధ్రాలో మాత్రమేకాక ఇతర రాష్ట్రములందు సహా క్రీస్తు వాక్యము ప్రకటించు అవకాశమును కల్పించి క్రీస్తు రాజ్య విస్తరణ కొరకు మిక్కిలి ప్రయాసముతో పాటు పడుచుండుట మరొక ప్రశంశ నీయ విషయం.

అప్పారావుగారు మరణమునకు కొన్ని గంటలముందు వారిని పరామర్శించ వచ్చిన స్నేహితులను గమనించి వారిలో ఒకరు ఇంకను క్రీస్తు సువార్తకు లోబడక రక్షించబడక ఉండు విధమును స్మరణకు తెచ్చుకొని అయ్యా మీరు క్రీస్తు సువార్తను అంగీకరించి రక్షణ పొందండి. ఈ జీవితము మనకు స్థిరముకాదు. క్రీస్తును నమ్మండి అంటూ తన వ్యాధి బాధను అణచుకొని క్రీస్తు ప్రేమను వారికి వెల్లడి చేసారు. ఇందును బట్టి నశించుపోవుచున్న ఆత్మల రక్షణకొరకు అప్పారావు గారు ఎంతటి ఆసక్తిని కలిగి జీవించేరో తెలియనగును.

అంతేకాదు ప్రతినెల మానక వారి ఆదాయమునుండి ఇతరులకు సహాయంచేసే విషయములో ధాతృత్వము కలిగి ఉండేవారు. ఒకరు అప్పారావుగారి నుండి M. O. అందుకొనిన మూడవ రోజున వారి మరణవార్త విని ఆశ్చర్యముతో ప్రలాపించారు.

అప్పారావుగారి శరీర భూస్థాపన జరిగిన రోజు (12–2–86) అందు పాల్గొన్న బంధుమిత్రులు ఆ రాత్రి కుటుంబ ఆదరణకొరకు సమావేశమై (కాకినాడలో వారి ఇంటిదగ్గర) ప్రార్థన కూటం జరిపిరి. అందు కూటం రోబీనమ్మగారు (అమలాపురం) మాటల్లో అప్పారావు గారి అనుభవాలు కొన్ని జ్ఞాపకము చేస్తూ "వారు కుటుంబ విషయం ములోగాని, సంఘ సమస్యలలోగాని ఎదురైన ప్రతిశోధన, ఇబ్బంది, క్షేమ విషయంలో ఏమాత్రము అధైర్యపడక క్రీస్తు మీద ఆనుకొని ప్రార్థన పూర్వకముగా విజయం సాధించేరని" ఆమె చెప్పారు. మాజీ

B. D. O. పల్లి నరసింహారావుగారు మాట్లాడుచు, "అప్పారావు గారు నాకు అక్షర అభ్యాసముచేసి నన్ను అన్నివిషయాల్లో అభివృద్ధికి తీసుకువచ్చిన గురువుగారు. వీరి చేతిలో విద్యార్థిగా ఉండి ఎట్టి భయ భక్తులతో జీవించేవాడనో నేను B. D. O. గా ఉన్నప్పుడు కూడ వారి విషయములో అదే భయ భక్తులతో జీవించాను. నేటికిని వారు నాకు గురువు నేను శిష్యుడను అన్న భావమునే కలిగియున్నాను. అట్టి వారిని కళ్లారా ఇక చూచే అవకాశం పొందలేక పోయానని" హృదయం బ్రద్ధలగునట్లు దుఃఖించిరి. ఇంకను అనేక మంది కుటుంబ ఆదరణకొరకు అనేక ఓదర్పుమాటలు చెప్పిరి. క్రమముగాను మర్యాద గాను కొందరి ప్రార్థనలతో కూటము ముగిసెను.

మరియు అప్పారావుగారు మిక్కిలిగా ప్రేమించి చిన్ననాటి నుండి శ్రమించి పనిచేసిన గంటి గ్రామము నందలి క్రీస్తు సంఘసభ్యు లందరితో వారి కుటుంబ సభ్యులందరు కలసి అప్పారావుగారి ద్వారా తమ కుటుంబానికి, సంఘానికి పరిసర ప్రాంతాలకు ప్రభువు అనుగ్ర హించిన కృపలకై ప్రభువుకు స్తుతులు చెల్లించు నిమిత్తము 16-2-86 తేది ఆదివారం ఉ॥ 11 గం॥లకు గంటి క్రీస్తు సంఘ ప్రార్థన మందిర ములో సమావేశము జరిపిరి. బహు స్వల్ప వ్యవధిలో ఏర్పాటు చేసిన స్తుతికూటమునకు అందుబాటులో ఉన్న ఆయా ప్రాంతములందలి సువార్త సేవకులు సంఘ సభ్యులు, బంధుమిత్రులు అధికసంఖ్యలో ఈస్తుతి కూటమునందు పాలు పొందిరి. ఆ దినము ఆదివారమగుటచే ఆరాధనా క్రమములో అందరు పాలు పొందిరి. పిమ్మట దేవుని కృపా శీర్వాదాలతో జరిగిన అప్పారావుగారి పరిచర్య నిమిత్తం ప్రభువుకు కృతజ్ఞత స్తుతులు చెల్లించుట జరిగెను.

ఈ సందర్భములో అప్పారావుగారి ద్వారా అక్షరాభ్యాసము పొందినవారు కొందరు, క్రీస్తు వాక్యానుభవం పొందినవారు కొందరు అప్పారావుగారి సహకారముతో తామెట్లు ప్రోత్సహింపబడినది, అశీ

ర్వాదముగు దేవుని కృపతో తామెట్లు అభివృద్ధి చెందుచున్నది చెప్పుచూ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిబుచ్చారు. ఆవేదికపై మాట్లాడినవారంతా అప్పారావుగారి నిజాయితీగల భక్తి జీవితాన్ని చెప్పుటకు మాటలు చాలవన్నారు.

**Bro. B.** ధనరాజుగారు అప్పారావుగారి మరణ వార్త విన్న వెంటనే "క్రీస్తు సంఘానికి పునాదివేసినవారు అప్పారావుగారు, వారి ద్వారానే క్రీస్తు సంఘ పరిచర్య డెల్టాలోను ఆంధ్రా అంతట ప్రారంభింపబడింది. మనమందరము అప్పారావుగారి వెనుక చేర్చబడితిమి. వారి మరణ వార్త వినుట నాకు చాల విచారముగా ఉంది" అన్నారు.

**Bro. R.** సామువేలుగారు (అమలాపురం) అప్పారావుగారి మరణ వార్త విన్న వెంటనే "క్రీస్తు సువార్త మా ఇంటికి తీసుకు వచ్చిన మొదటి వ్యక్తి అప్పారావుగారు. వారి జాలి హృదయముగల ప్రోత్సాహము క్రీస్తు పరిచర్యలో నన్నెంతగానో ఆదరించింది. వారు నిండుమనస్సుతో ప్రభువును కలుసుకొన్నారు. వీరి అడుగుజాడలే మనకు మిగిలిన ఆదరణ" అన్నారు.

అప్పారావుగారి భార్యాబిడ్డల ఓదార్పు కొరకు క్రీస్తు సంఘములు తమ తమ వ్యక్తిగత ప్రార్థనల యందును, ప్రార్థన కూటముల యందును జ్ఞాపకముంచుకొన గోరుచున్నాము.

— సత్యవాక్య విలేఖరి.

## ధన్య జీవి

మహోన్నత మహాసాగర గంభీరమా
ప్రేమామృత కలశమా
దయార్ద్ర హృదయుడా
దైవాశీస్సు నొందిన ధన్యజీవి

పుణ్య పురుషోత్తమా
దీర్ఘాయుష్మంతుడా !
మరణ శయ్యపై సహితం
రక్షణ సువార్తను
ప్రబోధించిన సద్బోధకుడా
ఓ మహాత్మ, మహర్షి,
ప్రేమ పితా ! నా...నాయనా...
"మీ"
అనంత అవిరత
విశాలమయ ప్రేమాప్యాయతలు
అనురాగ లాలిత్యం
ఈ పిడికెడు గూడె
నింపి,
కళ్ళ కొలనుల్లో
పొర్లి,
దుఃఖాబ్ధిలో తడిసి
ముద్ద చేస్తుంది,
నన్ను ముద్దు చేస్తుంది
పునీతుని గావిస్తుంది
మీరు వెళ్ళిన మార్గం పై
నా పరుగు ప్రారంభింప చేసింది.

— బెంజిమిన్ గూటిం

---

గమనిక :- విశాఖ లెక్చరర్‌షిప్ కొరకు ప్రత్యేకంగా ముద్రించిన చిన్న కీర్తన పుస్తకం కూడాలభించుచున్నది. వలయు వారు ఒక్క రూపాయి పోస్టేజీ స్టాంపులను సత్యవాణికి పంపి పొందవచ్చును.

# జీవన యాత్ర

## ( Life's Voyage )

మానవ జీవితము మహాసముద్రము వంటిది. సురక్షిత సముద్ర యానమునకు మంచి ఓడ అవసరమైయున్నది. మనము ఆ ఓడలో వుండాలి. క్రీస్తు ఒకే సంఘమును స్థాపించెను (మత్త 16:18). రక్షింపబడుటకు సంఘములో వుండాలి. సంఘము ఎల్లపుడు నిలుచును. సంఘమునకు వెలుపల గలవారు రక్షింపబడరనియు, సంఘములోగల విశ్వాసులు మాత్రమే రక్షింపబడుదురనియు వాక్యము చెప్పుచున్నది. (ప్రక 22:14, 2:10). నిత్యజీవపు ఒడ్డును సురక్షితముగా జేరుటకు సంఘమను ఓడ మానవులందరికొరకు సిద్ధపరచబడియున్నది.

### సమర్థుడైన నావికుడు

ఓడ ఎంత గొప్పదైనను సరియైన నావికుడు లేనట్లయితే అది గమ్యమెరుగని ప్రయాణముగా నుండును. గాని సంఘమను ఓడకు క్రీస్తు అనబడు సమర్థుడైన నావికుడు గలడు. ఆ ఓడలో ప్రయాణించు వారినందరిని అలలకు, ఆటు పోట్లకు అటు యిటు కొట్టుకొని పోకుండ సురక్షితంగా ఎలా చేర్చాలో ఆయనకు బాగుగా తెలియును. "ఆయన కుమారుడైయుండియు తాను పొందిన శ్రమలవలన విధేయత నేర్చుకొనెను, ఆయన సంపూర్ణ సిద్ధిపొందినవాడై తనకు విధేయులైన వారికందరికి నిత్య రక్షణకు కారకుడాయెను" (హెబ్రీ 5:8-9). ఇంతగొప్ప సంపూర్ణ సిద్ధి పొందిన నావికుడుండుటవలన నెట్టి ఆపదకు లోను గాకుండ మనలను సురక్షితముగా చేర్చును. క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నలాగున పురుషుడు భార్యకు శిరస్సైయున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడు. సంఘము క్రీస్తునకు లోబడినట్లుగా భార్యలు కూడ ప్రతి విషయములోను తమ పురుషులకు లోబడాలి. పురుషులారా, మీ భార్యలను ప్రేమించుడి. క్రీస్తు కూడ సంఘమును

ప్రేమించి అది కళంకమైనను, ముడతయైనను అట్టిది మరి యేదైనను లేక పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను, మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదక స్నానముచేత దానిని పవిత్రపరచి పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను (ఎఫె 5:23-27).

## దిక్సూచి

సముద్రయానము చేయుచున్న నౌకకు దిక్సూచి అవసరము. నౌకలోనున్న వారి అభిరుచులకు అతీతముగా ఈ నౌక సాగిపోవును (సామె 14:12, 16:25). పరిశుద్ధాత్మ మనకు దిక్సూచిగా నున్నాడు. వాక్యము ద్వారా పరిశుద్ధాత్ముడు పని చేయుచున్నాడు. సంఘ ప్రారంభ దినమందు అపొస్తలులు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్శక్తి అనుగ్రహించిన కొలది వారు అన్యభాషలతో మాటలాడ సాగిరి (కార్య 2:4). వారు తమ స్వాభిలాషను గాకుండ పరిశుద్ధాత్మ వారికి నిర్దేశించిన సత్యసువార్తను ప్రకటించిరి. నేడు మనమును పరిశుద్ధాత్మతో నడిపించ బడుటకు దైవావేశులైన అపొస్తలుల బోధలను మనము వినవలెను. దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకు, ఖండించుటకు, తప్పు దిద్దుటకు, నీతియందు శిక్ష చేయుటకు ప్రయోజనకరమై యున్నది (II తిమో 3:16, 17; II పేతు 1:21). గనుక సంఘము మానవుల యిష్టపూర్వకముగా కాక దేవుని వాక్యము ద్వారా పరిశుద్ధాత్మచే నడిపించబడవలయును.

## పటము

ఒక నౌక సముద్రములో పయనించుచున్నపుడు నిశ్చితమైన వివరణ పత్రము లేదా పటము చాలా అవసరమైయున్నది. లేనిచో ఆ నౌక గమ్యము లేకనే అటు యిటు ప్రయాణించి చివరకు నాశన

మగును. దేవుడు కూడ సంఘమును తన నావను నడుపుటకు సంపూర్ణమైన వివరణ పత్రమును మనకిచ్చియున్నాడు. నీ ఉపదేశమువలన నాకు వివేకము కలిగెను, తప్పు మార్గములన్నియు నాకసహ్యములాయెను. నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగైయున్నది (కీర్త 119 : 104, 105). మూడు సం॥లు అపొస్తలుడైన పౌలు ఎఫెసు సంఘంలో పని చేసిన పిమ్మట ఆ సంఘ పెద్దలతో సంభాషించుచు "ఇప్పుడు దేవునికిని ఆయన కృపావాక్యమునకును మిమ్మును అప్పగించుచున్నాను. ఆయన మీకు క్షేమాభివృద్ధి కలుగజేయుటకును, పరిశుద్ధపరచబడిన వారందరిలో స్వాస్థ్యము ననుగ్రహించుటకును శక్తిమంతుడు" అని చెప్పాడు. అప్పటికే ఎఫెస్సి సంఘమును నావను నడిపించుటకు అవసరమైన వివరణ పత్రము లేదా స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమము పూర్తిగా యివ్వబడినదని పౌలునకు తెలియును. అదే నడిపింపు విధానము నేడు మన సంఘములకు గూడ అవసరమైయున్నది. తన మహిమను బట్టియు, గుణాతిశయమును బట్టియు మనలను పిలిచిన వాని గూర్చిన అనుభవజ్ఞానమూలముగా ఆయన దైవశక్తి జీవమునకును, భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నది (2 పేతు 1:3). అందుచేత సమస్త కల్మషమును విజృంభించుచున్న దుష్టత్వమును మాని లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వీకముతో అంగీకరించుడి (యాకో 1:21).

సముద్రములో ప్రయాణించు ఓడ తుఫానులను తట్టుకొనుటకు బలమైన మోకుల నుపయోగింతురు. మరియు ఇనుప గొలుసులకు చివర పెద్ద పెద్ద బరువులను కట్టి ఆపద సమయములో వాటిని సముద్రములోనికి జారవిడుచుటద్వారా ఓడను సురక్షితముగా నుంచుదురు. అటులనే మానవుని జీవితములో సంభవించు బలమైన తుఫానులను తట్టుకొనుటకు గట్టి "మోకు" అను "నిరీక్షణ" మనకు కావలెను. "ఏలయనగా మనము నిరీక్షణ కలిగిన వారమై రక్షింపబడితిమి, నిరీక్షింపబడునది

కనబడునప్పుడు నిరీక్షణతో పని యుండదు. మనము చూడని దాని నిరీక్షించిన యెడల ఓపికతో దాని కొరకు కనిపెట్టుదుము (రోమా 8:24,25). లేఖనములవలన మనకు నిరీక్షణ కలుగును (రోమా 15:4) సువార్త సత్యమువలన నిరీక్షణ (కొల 1:5). ఈ నిరీక్షణ నిశ్చలమును స్థిరమునై మన ఆత్మకు లంగరువలె నుండి తెరలోపల ప్రవేశించు చున్నది (హెబ్రి 6:19).

సాధారణముగా ఎట్టి ప్రకృతి వైపరీత్యములు లేకుండా ఓ[illegible] ప్రయాణించుచున్నప్పుడు అందలి నావికులు ప్రయాణీకులందరు ఆన[illegible] ముగా నుందురు. అటులనే సంఘమను ఓడలోనున్న క్రైస్త[illegible] లందరు ఎల్లప్పుడు ఆనందంగా యుండాలని వాక్యము తెల్పుచున్న[illegible] సంతోషించు వారితో సంతోషించుడి (రోమా 12:15). క్రీస్తు శ్ర[illegible] లలో పాలివారై యున్నంతగా సంతోషించుడి (1 పేతు 4:1[illegible] II కొరి 13:11).

## ప్రవేశించు సమయము

ఒక రేవునుండి ఓడ బయలు దేరుటకు యొక నిర్ణీత సమయ[illegible] ముండును. ఓడ రేవును విడచిన తరువాత ప్రయాణీకులు వచ్చినచ[illegible] ఫలితము శూన్యము. లూకా 12:16-21 ఉపమాన భాగములో గ[illegible] ధనవంతుడు ఐహిక విషయము లంద తృప్తి కృషై ఈ నిత్యజీవపు ఓ[illegible] లోనికి ప్రవేశించుటకు ఆలస్యము చేసెను. ఈ దినములందు గూ[illegible] అనేకమంది ఆ ధనవంతునివలె భౌతిక విషయములందే లక్ష్యముంచ[illegible] చున్నారు. "పగలున్నంతవరకు నన్ను పంపినవాని క్రియలు మనమ[illegible] చేయుచుండవలెను, రాత్రి వచ్చుచున్నది అప్పుడెవడును పనిచేయ[illegible] లేడని యేసు చెప్పెను (యోహా 9:4) రేపేమి సంభవించునో మీ[illegible] తెలియదు (యాకో 4:14). మన దినములు కొద్దిపాటివి (కీర్త 90:10) గనుక నీవు ఆలస్యము చేయుటెందుకు ? లేచి ఆయన నామమును[illegible]

బాప్తిస్మము పొందుట ద్వారా నీ పాపములను కడిగివేసికొనుము (కార్య 22:16)

## మూల్యము

ఓడలో ప్రయాణించుటకు తగు మూల్యము చెల్లింపనిదే లోనికి అనుమతింపబడరు. సీయోను ఓడలో ప్రయాణించుటకు మనమును తగు మూల్యమును చెల్లించాలి. "నమ్మి బాప్తిస్మము పొందువాడు రక్షింపబడును" (మార్కు 16:16). ఈ ఆజ్ఞను నెరవేర్చకుండా ఇంతవరకు ఎవరును ఆ ఓడలోనికి ప్రవేశించలేదు. సీయోను ఓడ నావికుడైన క్రీస్తు యొక్క ఆజ్ఞ యది.

— బి. వి. కుమార్, తిమ్మాపురం.

## " నా మాట అగ్నివంటిది కాదా ? "

## ( *Is not my Word like a Fire ?* )

"నా మాట అగ్ని వంటిది కాదా ? బండను బద్దలు చేయు సుత్తె వంటిది కాదా ?" యని యిర్మియా 23 : 29 లో యెహోవా దేవుడు చెప్పుచున్నాడు.

దేవుని వాక్యమైన బైబిలు అనేక విధములుగ అగ్ని వలె యున్నది. వాతావరణం చాల చలిగా యున్నప్పుడు వేడిని సుఖాన్ని కలిగించడానికి అగ్నిని వినియోగిస్తాము. అట్లే మనకు బాధకలిగినప్పుడు బైబిలు మనకు నెమ్మది కలుగజేస్తాది. దావీదు ఇట్లు చెబుతున్నాడు: "నీ వాక్యము నన్ను బ్రతికించియున్నది. నా బాధలో ఇదే నాకు నెమ్మది కలిగించుచున్నది" (కీర్తన 119:50)

చీకటిలో వెలుగు నిచ్చుటకు మనము అగ్నిని రాజబెట్ట వచ్చును. పాపపు చీకటిని పారద్రోలే వెలుగు దేవుని వాక్యము. యేసు ప్రభువు ఇట్లు చెప్పాడు: "ఆతీర్పు ఇదే వెలుగు లోకమునొనకి వచ్చెను, గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును, తన క్రియలు దుష్క్రియలుగా కనబడకుండునట్లు వెలుగు నొద్దకురాడు. సత్య వర్తనుడైతే తన క్రియలు దేవుని మూల

ముగా చేయబడియున్నవని ప్రత్యక్ష పరచబడునట్లు వెలుగు నొద్దకు వచ్చును" (యోహాను 3 : 19, 21). బైబిలు మనకు మార్గాన్ని చూపిస్తున్నది : "నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది" (కీర్తన 119:105).

పవిత్ర పరచి పరిశుద్ధ పరచుటలో దేవుని వాక్యము అగ్నివలె యున్నది. కలుషితమైనవి కరగిపోవునట్లు ప్రశస్త పదార్థములు పుటము వేయబడ్డాయి. మన జీవితాల్లో పాపముపై బైబిలు యొక్క ప్రభావం అట్టిదే. "నేను మీతో చెప్పిన మాటనుబట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు" (యోహాను 15:3).

అవును దేవుని వాక్యము అగ్నివంటిదే. అది మనకు ఆదరణ నిచ్చును, త్రోవకు వెలుగు చూపును, పాపమునుండి మనలను పవిత్రులుగా చేయును. బైబిలు కొరకు దేవుని వందనములు.

---

Regd. No. H/KD—45/KD.H.O.

*From*
**SATYA WAKKU**
**P.O. Box. 80**
**KAKINADA-533 001**

No.

To

..............................

..............................

..............................

..............................